

శేషాచలం అడవికి నిప్పు
శేషాచలంలోని అడవికి కొందరు దుండగులు బుధవారం నిప్పుపెట్టడంతో పచ్చని చెట్లు బుగ్గి అయిపోయాయి. - 8లో



'ఆరణి'ని మార్చాల్సిందే
ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులును తప్పించాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ డిమాండ్ చేశారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సా)	సహర్ శుక్రవారం(ఉ)
చిత్తూరు	6.29	4.51
పుంగనూరు	6.31	4.54

న్యూస్‌రీల్

వలంటీర్లు రాజీనామా చేసి ప్రచారంలోకి వెళ్లొచ్చు


మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు


చిత్తూరు రూరల్: వలంటీర్లు రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొన వచ్చని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. వలంటీర్లు రాజీనామా చేసి ప్రచారంలోకి వెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొంత మంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై మీడియా జేసీని ప్రశ్నించగా, వలంటీర్లు రాజీనామా చేసి ప్రచారంలోకి వెళ్లొచ్చని తెలిపారు. ఎన్నికలలో కూడా పోటీ చేయవచ్చని వివరించారు. సోషల్ మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని చెప్పారు. ప్రచారంలో పాల్గొన్నా వారిని ఆపే అధికారం ఎవరికీలేదని వివరించారు. అధికారులకు మాత్రం ఎన్నికల నియమావళి వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.78లక్షలు


కాణిపాకంలో హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు

ఐరాల: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ ఆదాయం రూ.78లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయంలో గత 14 రోజుల హుండీ కానుకలను బుధవారం ఉదయం స్వామివారి ఆస్థాన మండపంలో లెక్కించగా బంగారం 14 గ్రాములు, వెండి 910 గ్రాములు, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.5వేలు, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.20 వేలు, విదేశీ కరెన్సీ 1,066 డాలర్లు, ఇంగ్లాండ్ 15 పౌండ్స్, ఆస్ట్రేలియా 50 డాలర్లు, మలేసియా 1 రింగిట్స్‌తో కలిపి రూ.78లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీవైఈఓ వాణి, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాణిపాకం ఎస్‌ఐకి అవార్డు



ఎస్‌ఐ రామ్మోహన్

ఐరాల: కాణిపాకం ఎస్‌ఐ రామ్మోహన్‌కు డీజీపీ కామిడేషన్ డెస్క్ అవార్డు లభించింది. ఎస్‌ఐ రామ్మోహన్ 2022లో అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోట పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించే సమయంలో కర్ణాటక నుంచి వస్తున్న అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపి, అక్రమ రవాణా అరికట్టారు. రెండు హత్య కేసుల్లో డిటెక్ట్ చేసి, ప్రాపర్టీలను రికవరీ చేయడంతో ఆయనకు బుధవారం డీజీపీ కామిడేషన్ డెస్క్ అవార్డు లభించింది. దీనిపై పోలీసు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.



''వడ్డించే వాడు మనవాడైతే.. బంతిలో ఎక్కడ కూర్చుంటే ఏంటి'' అంటారు పెద్దలు. పాలకుడికి చిత్తశుద్ధి మారుమూల గ్రామంలో ఉన్నా మేలు చేస్తాడు. కుప్పం నియోజకవర్గంలోని శ్రీనివాసపురంలో ఇదే రుజువైంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలు ఎలా ఉందో ఈ పల్లెను పరిశీలిస్తే స్పష్టమవుతుంది. అటవీ ప్రాంతంలో ఉన్నా సరే ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోంది. కొన్ని కుటుంబాలకు మరింతగా మేలు జరుగుతోంది. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన ఈ ఊరు.. ఇప్పుడు సంక్షేమ వెలుగుల్లో అలరారుతోంది.





సంక్షేమం.. సిరినివాసం..!

- ప్రగతిపథంలో కుగ్రామం
- ఆంధ్ర–తమిళనాడు సరిహద్దులోని అటవీ ప్రాంతం
- ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఫలాలు
- కొన్నింటికి మూడు నుంచి నాలుగు పథకాల కింద లబ్ధి
- ఇదీ గుడుపల్లె మండలంలోని శ్రీనివాసపురం పురోగతి

సాక్షి, తిరుపతి డెస్క్ : ఆంధ్ర–తమిళనాడు సరిహద్దులోని శ్రీనివాసపురం గత ప్రభుత్వాల హయాంలో పూర్తి నిరాదరణకు గురైంది. అటవీప్రాంతంలోని ఈ పల్లెను ఎవరూ పట్టించుకునేవారు కాదు. అయితే ఇప్పుడు పరిస్థితిలో పూర్తి మార్పు వచ్చింది. పక్కనే ఉన్న తమిళనాడు పరిధిలోని గ్రామాల ప్రజలు సైతం తమను ఆంధ్రలో చేరిస్తే బావుంటుందనే స్థాయి వచ్చింది. ఎందుకంటే శ్రీనివాసపురంలో గ్రామస్తులకు అందుతున్న సంక్షేమ పథకాలు అలా ఉన్నాయి. కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం ఓఎన్ కొత్తూరు పంచాయతీలో శ్రీనివాసపురం ఉంది. ఆ ఊరు దాటితే తమిళనాడే. ఆ గ్రామంలో 47 ఇళ్లు ఉన్నాయి. ప్రతి ఇంటికి వలంటీరు వచ్చి వారికి అర్హత మేరకు పథకాలకు దరఖాస్తు చేయించారు. దీంతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోంది. కొన్ని ఇళ్లకు మూడు, నాలుగు పథకాలు కూడా అందుతున్నాయి.

గతంలో ఎవరికీ గుర్తులేదు

కుప్పం–వేపనపల్లె మార్గంలోని అటవీ ప్రాంతంలో శ్రీనివాసపురం గ్రామం ఉంది. ఇక్కడ 47 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇటీవల ఆ ఊర్లోని మూడు కుటుంబాల వారి పిల్లలు కొత్తగా ఇళ్లు కట్టుకుని జీవిస్తున్నారు. దీంతో 50 ఇళ్లు అయ్యాయి. 2019 వరకు శ్రీనివాసపురం గ్రామం ఆంధ్ర పరిధిలోనే ఉందనే విషయం పాలకులు, అధికారులకు గుర్తు లేదంటే అతిశయోక్తి కాదు. 2019లో ఈ ప్రభుత్వం రాగానే గ్రామానికి కొత్త వెలుగులు వచ్చాయి. దీనికి తోడు పంచాయతీ కేంద్రం ఓఎన్ కొత్తూరులో సచివాలయం నిర్మించారు. ప్రభుత్వ సేవలు అవసరమైన వారు దూరాభారం వెళ్లాల్సిన పనిలేకుండా సచివాలయానికి వెళ్లి తమ పనులు పూర్తి చేసుకుంటున్నారు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడంతో స్థానిక రైతులు విత్తనాలు, ఎరువుల కోసం తమిళనాడుకు వెళ్లాల్సిన అవస్థలు తప్పాయి. అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో గ్రామస్తుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఠంచనుగా అందుతున్నాయి



మాకు రైతు భరోసా అందుతోంది. ప్రతి సంవత్సరం నా ఖాతాలో నగదు జమ అవుతోంది. అదేవిధంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఇల్లు కూడా మంజూరు చేశారు. గతంలో మాకు ఏ పథకాలు వచ్చేవి కావు. మా ఊరు గురించి పట్టించుకున్న వాళ్లు లేరు. ఈ ప్రభుత్వంలో మాకు అర్హత ఉన్నవన్నీ ఇస్తా ఉండారు. – సుజాత, శ్రీనివాసపురం

ఇంతకంటే ఎవరు చేస్తారు?



ఒక్కో ఇంటికి ఇన్ని పథకాలు వస్తాయని మేం ఊహించనే లేదు. ఈ ప్రభుత్వంలో మా కుటుంబానికి రైతు భరోసా వస్తా ఉంది. పింఛను ఇస్తున్నారు. చేయూత, ఆసరా పథకాల కింద లబ్ధి చేకూరింది. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లభిస్తోంది. పేదల అభివృద్ధి కోసం ఇంతకంటే ఎవ్వరూ చేయలేరు. – మాదమ్మ, శ్రీనివాసపురం

అడగకనే అన్నీ ఇచ్చారు



మేం ఏమీ అడగలేదు. వలంటీరు వచ్చాడు. మా ఇంట్లో వాళ్ల వివరాలు రాసుకుని పోయాడు. ఆ తర్వాత మా కుటుంబానికి రైతు భరోసా అందుతోంది. నాకు పింఛను వస్తోంది. ఆసరా, చేయూత పథకాల కింద మాకు లబ్ధి చేకూరుతోంది. – మురుగమ్మ, శ్రీనివాసపురం

నాలుగు పథకాలు వస్తున్నాయి



ఈ ప్రభుత్వం మా ఇంటికి నాలుగు సంక్షేమ పథకాలు అందిస్తోంది. నాకు రైతు భరోసా వస్తోంది. ఇల్లు మంజూరైంది. నా భార్యకు అమ్మ ఒడి కింద లబ్ధి చేకూరుతోంది. ఆసరా పథకం కింద డబ్బులు వచ్చాయి. మాకు ఎవరి రికమెండేషన్ లేదు. వలంటీర్ వచ్చి రాసుకోని పోయాడు. అన్ని పథకాలు ఇచ్చారు. – పళణి, శ్రీనివాసపురం

వైఎస్సార్‌సీపీ గూటికి టీడీపీ మాజీ వైస్ ఎంపీపీ


అనుచరులతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ మాజీ వైస్ ఎంపీపీ హంస

విజయపురం : మండలానికి చెందిన టీడీపీ మాజీ వైస్ ఎంపీపీ హంస తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి ఆర్కే రోజా నివాసంలో గురువారం వీరందరూ పార్టీ కండువా కప్పుకున్నారు. హంసతోపాటు గోవిందరాజులు, రంజిత్ కుమార్, విజయకుమార్, పడయప్ప, దళపతి, అబ్బులు, తంగరాజ్, బాలన్, ఏలుమళై, చిన్నస్వామి, మాతయ్య, మణి, సుబ్రహ్మణ్యం, పెద్ద గొల్లప్ప, సింగారం, త్యాగరాజ, రవి తదితరులను మంత్రి రోజా పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ వైస్ ఎంపీపీ హంస మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్, నగరి నియోజకవర్గంలో మంత్రి ఆర్కే రోజమ్మ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చూసి తాము స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికలలో పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ రోజమ్మ గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. మంత్రి ఆర్కే రోజా గెలుపును ఎవరూ అడ్డుకోలేరని, మూడోసారి గెలిపించి రికార్డు తిరిగి రాస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, సునందామనోహర్ రెడ్డి, బాబు, ఎంపీటీసీలు గోవిందమ్మ, రాజగోపాల్, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్ రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, కిషోర్‌రెడ్డి, మునికృష్ణ, అంగముత్తు, నారపరాజు, శ్రీరాములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటమి భయం

- ప్రజల్లో మార్పుచూసి మతిభ్రమించింది
- 35 ఏళ్లలో చేయలేదు.. కానీ 5 ఏళ్లలో చేస్తాడట?
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, భరత్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

కుప్పం: నియోజకవర్గ ప్రజల్లో వచ్చిన మార్పు చూసి ఓటమి భయంతో చంద్రబాబుకు మతిభ్రమించి ఇచ్చిన హామీలనే ఇస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, భరత్ అన్నారు. ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం వీరు మీడియాతో మాట్లాడారు. 35 ఏళ్లు ఎమ్మెల్యేగా, మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కుప్పానికి ఏమీ చేయలేకపోయాడు కానీ, ఇప్పుడు అవకాశం ఇస్తే ఐదేళ్లలో అన్నీ చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కుప్పంను సింగపూర్‌ను చేస్తామని దశాబ్దాల నుంచీ చెబుతూనే ఉన్నారు గానీ చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని, అందుకే సంక్షేమ పథకాలు మహిళలకే అందేలా చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మహిళలంతా జగన్ వెంటే ఉన్నారని గ్రహించిన చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని చెప్పారు. టీడీపీకి ఓటు వేయకపోతే ఇంట్లో మగవాళ్లకు భోజనం పెట్టొద్దని, ఇంట్లోకి రానివ్వద్దంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో నియోజకవర్గంలోని ప్రశాంతంగా జీవించే కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవా కాలువను వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభిస్తే ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పూర్తి చేసింది వాస్తవమని, అది ఇక్కడున్న ప్రజలందరికీ తెలుసని స్పష్టం చేశారు. వలంటీర్లపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్ల ఉద్యోగాన్ని గోనెసంచీలు మోసే ఉద్యోగమంటూ గతంలో హేళన చేసిన చంద్రబాబు, ఇప్పుడు వలంటీర్ల వర్క్‌ఫ్రమ్ హోం కల్పిస్తామని చెబితే ఎవరైె నమ్మడానికి సిద్ధంగా లేరని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో 10 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్న చంద్రబాబు, అధికారంలో ఉన్నప్పుడు చిత్తూరు విజయ డెయిరీని ఎందుకు మూసివేయించారని ప్రశ్నించారు. తన సొంత హెరిటేజ్ డెయిరీ కోసం జిల్లా వ్యాప్తంగా పాడి రైతులను నాశనం చేశారని గుర్తుచేశారు. స్థానికంగా ఉన్న నాయకత్వంపై నమ్మకంలేక బాపట్ల నుంచి కోటీశ్వరుడిని తీసుకొచ్చి ఎంపీగా నిలబెట్టారని విమర్శించారు. కుప్పంలోని ప్రజలు చంద్రబాబు హామీలు, కల్లుబొల్లి మాటలు నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు. వైఎస్సార్ సీపీ బలం పెరిగిందని, ఈ ఎన్నికల్లో కుప్పంలో జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, జెడ్పీటీసీ శరవణ, మండల కన్వీనర్ మురుగేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్‌లోకి వలసల వెల్లువ

- గుంపులు, గుంపులుగా చేరుతున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు
- ఆహ్వానించిన వైఎస్సార్ సీపీ నాయకులు


చిత్తూరు: విజయానందరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు


రామకుప్పం: ఎంపీ రెడ్డెప్ప సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు


పలమనేరు: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటేగౌడ


చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అలాంటి పాలనే తిరిగి రావాలని కోరుతూ బుధవారం పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జనసేన నగర ప్రధాన కార్యదర్శి కనిష్క ఆధ్వర్యంలో 17 మంది జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. వీరందరికీ వైఎస్సార్ సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరామని కనిష్క తెలిపారు. చిత్తూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు తమ వంతు కృషి చేయనున్నట్లు వివరించారు. పార్టీలో చేరిన వారిలో కార్తీక్, రమేష్, చిరంజీవి, సతీష్, మహేష్ మణి, సరస్వతి, పుష్ప, షాలిని, అంజాద్, చాము, జాఫర్, కౌశిక్, రోహిత్ తదితరులు ఉన్నారు.

పార్టీలోకి సాకేపూరు వాసులు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ సాకేపూరుకు చెందిన టీడీపీ కుటుంబాలు బుధవారం స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. పలమనేరులో చంద్రబాబు పర్యటించిన రోజే వైఎస్సార్‌సీపీలో చేరి, టీడీపీకి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో నందకుమార్‌గౌడు, శ్రీకాంత్‌నాయుడు, సురేష్‌గౌడు, ప్రియ, తులసమ్మ తదితరులున్నారు. వీరికి పార్టీ కండువాలను కప్పి ఆయన సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగన్న, చెంగారెడ్డి, రాజారెడ్డి, అమరనాథరెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్ గోవిందస్వామి, మనోజ్‌రెడ్డి, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన 30 ముస్లిం కుటుంబాలు

కుప్పం రూరల్: కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డుకు చెందిన 30మంది ముస్లిం కుటుంబాలు మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరందరికీ కుప్పం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో చాన్, ముబారక్, హైదర్ అలీ, యాసీన్‌లు మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో వజీర్, టైలర్‌బాషా, ఫయాజ్, అబ్‌ను, ఆయాజ్, చాంద్‌బాషా, రహమతుల్లా, ముస్తాఫా, వలీ, ఇంతియాజ్, నవాజ్, ఆనంద్, శివ తదితరులు ఉన్నారు.


కుప్పం: పార్టీలో చేరిన వారితో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్

పార్టీలోకి టీడీపీ కుటుంబాలు

రామకుప్పం: మండలంలోని సింగసముద్రం పంచాయతీ పరిధిలోని రెడ్డివారిపల్లి, సింగసముద్రం గ్రామాలకు చెందిన సుమారు 30టీడీపీ కుటుంబాలు బుధవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి ఎంపీ రెడ్డెప్ప కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సోమప్ప, గోవిందప్ప, వేణుగోపాల్, శివమణి, అమరేష్, మురుగేష్, మురళి, సావిడప్ప, నారాయణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, మండల కో- ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, స్థానిక సర్పంచ్ చినతాయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు అశ్విని, నేతలు జయప్ప, గోవిందు, జాబీర్ బాషా, వెంకటేశు, మురుగేష్, చంద్రప్ప పాల్గొన్నారు.

నోడల్ అధికారులు నిబద్ధతతో పనిచేయాలి


నోడల్ అధికారులతో మాట్లాడుతున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల విధులు కేటాయించిన నోడల్ అధికారులు నిబద్ధతతో పనిచేయాలని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ అన్ని కమిటీల నోడల్ అధికారులు రోజువారీ నివేదికలను, రికార్డులను సక్రమంగా, తప్పనిసరిగా నిర్వహించాలని చెప్పారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు నివేదికలను ఆర్‌ఓల నుంచి సేకరించి జిల్లా ఎన్నికల అధికారికి పంపాలని తెలిపారు. నోడల్ ఆఫీసర్ల విధులను తెలుసుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, వివిధ బృందాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టెంపో- ట్రాక్టర్ ఢీ



ప్రమాదం జరిగిన ప్రదేశంలో టీడీ వాహనం, బోల్తా పడిన ట్రాక్టర్

వి.కోట: టెంపో ట్రావెలర్, ట్రాక్టర్ ఢీకొని పలువురు గాయాలైన సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి కుప్పం పర్యటన అనంతరం పలమనేరు బహిరంగ సభకు బయల్దేరారు. ఆయనతోపాటు మీడియా ప్రతినిధుల టెంపో ట్రావెలర్ బయల్దేరింది. పట్టణంలోని కుప్పం -వి.కోట జాతీయ రహదారి ముదిమడుగు క్రాస్ వద్ద టెంపో, ట్రాక్టర్ ఢీకొన్నాయి. ట్రాక్టర్ బోల్తాపడగా, టీడీ వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ టెంపో డ్రైవర్ తిరుపతికి చెందిన సంజీవ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. హెచ్‌ఎంటీవీ కెమెరామన్‌కు గాయాలయ్యాయి. మిగిలిన వారందరూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కల్గడంతో, పోలీసుల చొరవతో ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. క్షతగాత్రులను హుటాహుటిన స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు.

శేషాచలం అడవికి నిప్పు

ఏర్పేడు : మండలపరిధిలోని శేషాచలం అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. బుధవారం ఆమందూరు బీసీ కాలనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తుల నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి వృక్ష సంపద ఆహుతవుతోంది. ఇప్పటికైౖ అటవీశాఖ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసులకు డీజీపీ అవార్డులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న పలువురు పోలీసు అధికారులకు డీజీపీ అవార్డులు లభించాయి. బుధవారం రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమేరకు చిత్తూరు ఎస్పీ జాషువాకు వెండి పతకాన్ని ప్రదానం చేయనున్నారు. పాలసముద్రంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న డి.వెంకటేశులుకు వెండి పతకం వరించింది. డీఎస్పీ సుధాకర్‌రెడ్డి (పలమనేరు), కార్వేటినగరం సీఐ చంద్రశేఖర్, చిత్తూరు ఏఆర్ ఎస్ఐ రమేష్, పుంగనూరు అర్బన్ ఏఎస్ఐ వెంకటరత్నం, జీడీ నెల్లూరు హెడ్ కానిస్టేబుల్ జగదీష్, చిత్తూరు ట్రాఫిక్ కానిస్టేబుల్ మధుకుమార్, గంగవరం కానిస్టేబుల్ అల్లావుద్దీన్, ఎస్ఆర్‌పురం కానిస్టేబుల్ మోహన్‌బాబు, చిత్తూరు వన్‌టౌన్ కానిస్టేబుల్ రామకృష్ణ, వి.కోట అర్బన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ప్రతాప్‌కుమార్, చిత్తూరు ఏఎస్ఐ మనోహర్‌లకు కాంస్య పతకాలు లభించాయి.

ప్రచార సామగ్రిపై దుష్ప్రచారమెందుకు?

- అక్కడ నిల్వ చేసింది ప్రచార సామగ్రి మాత్రమే
- వివిధ కంపెనీలకు జీఎస్టీ చెల్లించి కొనుగోలు చేశాం
- ప్రలోభాలకు గురిచేసే వస్తువులుంటే జప్తు చేసుకోవచ్చు
- రశీదులు, బిల్లులు ఎన్నికల సంఘానికి సమర్పించాం
- వైఎస్సార్‌సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



రేణిగుంట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారికంగా కొనుగోలు చేసిన ప్రచార సామగ్రిపై దుష్ప్రచారం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించనున్న సాధారణ ఎన్నికల నిమిత్తం పార్టీకి అవసరమైన ప్రచార సామగ్రిని 2023 అక్టోబర్ నుంచి 2024 మార్చి 14వ తేదీ వరకు వివిధ తేదీల్లో పలు సంస్థల నుంచి జీఎస్టీ చెల్లించి మరీ కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఆయా వస్తువులను రేణిగుంట సమీపంలోని పాత విమానాశ్రయం రోడ్డులోని గోదాములో నిల్వ చేసినట్లు తెలిపారు. అయితే కొన్ని పార్టీల నాయకులు తాము ప్రజలను ప్రలోభపెట్టేందుకు సదరు సామగ్రిని భద్రపరిచినట్లు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారని, ఆమేరకు తనిఖీలు చేయించారని అన్నారు. వాస్తవానికి అక్కడ నిల్వ చేసిన పార్టీ ప్లకార్డులు, జెండాలు, కండువాలు, టోపీలు వివిధ రకాల రోజువాడే ప్రచార సామగ్రి మొత్తం రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రచారానికి సంబంధించినవే అని తెలిపారు. ఆ సామగ్రికి సంబంధించిన కొనుగోలు రశీదులు, బిల్లులను ఎన్నికల సంఘానికి సమర్పించామని వివరించారు. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధికారిక లెక్కల్లో సైతం నిబంధనల ప్రకారం పేర్కొన్నామని వెల్లడించారు. ఎన్నికల సంఘం అనుమతితోనే పార్టీ కార్యకర్తలకు ప్రచార సామగ్రిని పంపిణీ చేస్తామని చెప్పారు. ఎన్నికలకు సమాయత్తంలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు సైతం ఇదేవిధంగా ప్రచార సామగ్రిని సిద్ధం చేసుకుంటాయని తెలిపారు. ప్రజలను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు ఎక్కడైనా ఉంటే ఎన్నికల సంఘం తమ విశేషాధికారాలను వినియోగించి జప్తు చేసుకోవచ్చని స్పష్టంచేశారు. అయితే రాజకీయ పార్టీ తమ ప్రచారంలో భాగంగా అన్ని అనుమతులతో కొనుగోలు చేసుకుని వాడుకునే సామగ్రికి ఎవరూ అడ్డుపడకూడదని ఆయన ప్రకటనలో కోరారు. తాము బిల్లులు చూపించామనీ, రేపు ఇదే విధంగా ఇతర పార్టీల నాయకులు కూడా తమ ఎన్నికల ప్రచార సామగ్రిపై ఫిర్యాదుచేస్తే తమ లాగా అధికారంగా బిల్లులు చూపించగలరా అన్నారు. పార్టీ ప్రచార సామగ్రిపై కూడా ఫిర్యాదులు చేసుకునే సంప్రదాయం మీరు కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు.

బాబు హామీల్..అన్నీ ఉడాల్..!

అరిగిన హామీల క్యాసెట్టు..
వేశాడే మళ్లీ పెసరట్టు..
జనం అంతా అదిరేట్టు..!



అని కుప్పం, పలమనేరు ప్రైజలు మళ్లీ తల్‌కాయలు పట్టుకున్నారు. చెంద్రబాబు ఎప్పుడు జూసినా చెప్పిందే చెప్పీ..చెప్పీ బేజారెత్తిస్తాందప్పా..ఏందోబ్బా.. ఈ పార్టీ ఇయర్ప్రు ఇండస్టిరీ అని నిస్టూర మాడినారు. అధికార పచ్చం పారిటీ వోళ్ల ప్రైచారానికి నిద్ర పట్టక కుప్పానికి, పలమనేరుకు వచ్చిన చెంద్రబాబు 'ప్రైజాగలం'లో కొత్తగా ఏమైనా చెప్తాడనుంటే ఏం చెప్పలేదప్పా.. మళ్లీ పాత గలమే ఇప్పినాడు. కుప్పంలో అరచేతిలో సింగపూరు సొక్కాయి చూపిచ్చినాడు.. ఇమానాలు ఎగిరిపిచ్చినాడు..బెంగలూరుకు నాలుగ్గీతల రోడ్డేసినాడు..అంద్రీ-నీవా నీళ్లు పారిచ్చినాడు..అని ఎకసెక్కాలాణ్నారు. పోనీ పలమ్‌నేర్‌లో అయినా కొత్తగా ఏమైనా చెప్తాడా అన్కుంటే ఈడ కూడా అరిగిపోయిన పాత హామీల క్యాసెట్టేసినడబ్బా! ఫ్యాక్రటీలు కట్టించి, ఉజ్జోగాలిప్పిస్తాడంట..ఈడుంటే వోళ్లు బెంగలూరుకు పనుల కోసం పోయేది కాదు..బెంగలూరోల్లే ఈడికి ఉజ్జోగాలు, పనులకు వచ్చేలా చేస్తాడంట! ఓయమ్మా..ఇది నమ్మే మాటేనా..చెప్పుయా!? బాబు చెప్పేవన్నీ ఉడాల్ మాట్లేయా! అని జెనాలు ఎండ చుర్రుమనేకాడికి తల మీద గుడ్డేసుకుని 'ప్రైజాగలం' నుంచి ఎలబారి ఇళ్లకు పోయినారు. -పలమనేరు

ఆ వీడియోలు గ్రూపులో వచ్చేశాయి



పలమనేరు: కొందరు పార్టీల నాయకులు, కార్యకర్తలు డబుల్‌గేమ్ ఆడుతూ దొరికిపోతున్నారు. ఇరు పార్టీల నేతల వద్ద నమ్మకంగా ఉంటూ డ్రామాలకు తెరతీస్తున్నారు. ఎవరు విందు పెట్టినా వెళతారు.. తింటారు.. అక్కడ ఆ పార్టీని పొగుడుతారు. అయితే సోషల్ మీడియా పుణ్యమా అని అడ్డంగా బుక్కయిపోతున్నారు. రెండు పార్టీల్లో ఆడిన డ్రామాలన్నీ వీడియో రూపంలో వైరల్ కావడంతో ఓరి దేవుడా అంటూ జుట్టు పీక్కుంటున్నారు. అసలేమయిందంటే..

పట్టణంలోని టీకొట్టు ముందు కార్యకర్తల మాటామంతి ఇలా సాగింది.

భాస్కర్: ఏం నాయుడన్నా నువు ఈడుంటే వైఎస్సార్‌సీపీ అంటావు.. మళ్లీ ఆడికిపోతే టీడీపీ అంటావు ఎట్టన్నా నిన్ను నమ్మేది..?

నాయుడు: ఒరే భాస్కరా నన్ను కనిబెట్టేకి ఎవరి నుంచీ కాదురా.. నీ మాదిరి ఓకే పార్టీలో ఉంటే ఎట్టా.. ఎప్పుడు ఏ పార్టీ వస్తుందో ఏమో అందుకే తెలివిగా ఉండానబ్బా..

భాస్కర్: నోవ్ ఇది కాదునా పద్ధతి.. ఎప్పటికైౖనా నీ బండారం బయటపడుతుంది.. అప్పుడేం చేస్తావో..

అప్పుడే అక్కడికి మోహనప్ప వచ్చాడు...

మోహనప్ప: ఏం నాయుడన్నా.. నీకింతా తెలీదా..గ్రూపులు చూస్తే కదా నువ్వు..

నాయుడు: ఏం గ్రూపులు చూడాల మోహనా..

మోహనప్ప: హయ్యో... ఏందినా నవ్వు.. ఇటు చూడు నువ్వు రెండు పార్టీల్లో తిరగతా ఉండే వీడియోలన్నీ వచ్చేసినాయి...

వెంటనే టీ కొట్టులోని వారందరూ ఈ వీడియోలు చూపెట్టమంటూ గుమికూడారు. దీంతో నాయుడు మెల్లగా అక్కడినుంచి జారుకున్నాడు. అక్కడున్నవాళ్లంతా తెగ నవ్వుకున్నారు. ఇలా పార్టీల పేరుతో రెండు వైపులా లబ్ధి పొందేవారికి సోషల్ మీడియా బద్ధ శత్రువులా మారింది.

ఎస్పీ రబ్బర్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



మంటల్లో ఎస్పీ రబ్బర్ ఫ్యాక్టరీ

గంగాధర నెల్లూరు: మండలంలోని సుందరరాజుపురం సమీపంలో ఉన్న ఎస్పీ రబ్బర్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికుల కథనం మేరకు, బుధవారం మధ్యాహ్నం ఫ్యాక్టరీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పు పక్కనుండే గడ్డిపై పడి మంటలు వ్యాపించాయి. అక్కడి నుంచి ఫ్యాక్టరీలో సిద్ధంగా ఉన్న టైర్ల పొడి మూటలు, పాతటైర్లు కాలడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే స్థానికులు ఫైరింజన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో చిత్తూరు ఏడీఎఫ్‌వో కరుణాకర్, హెడ్ కానిస్టేబుల్స్ సురేష్, బాబు, కానిస్టేబుల్స్ బాలాజీ, సతీష్ లు ఫైరింజన్‌తో తరలివచ్చి మంటలను అదుపు చేశారు. అయితే ఎస్పీ రబ్బర్ ఫ్యాక్టరీలో జరిగిన నష్టంపై వివరాలు పోలీసులకు, ఫైరింజన్ అధికారులకు ఫ్యాక్టరీ యజమాని ఫిర్యాదు చేయలేదని అధికారులు తెలిపారు.

'ఆరణి'ని మార్చాల్సిందే..!

తిరుపతి(అలిపిరి): ఎక్కడ నుంచో వచ్చిన వారికి తిరుపతిలో ఉమ్మడి అభ్యర్థిగా కేటాయించడం తిరుపతిలోని నాయకులకే కాదు.. ప్రజల మనోభావాలను దెబ్బతీశారని.. ఉమ్మడి అభ్యర్థిగా కేటాయించిన ఆరణి శ్రీనివాసులును తాను శత్రువుగానే పరిగణిస్తానని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. బుధవారం తన స్వగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ తనను సోదరిగా భావించానన్న ఆరణి శ్రీనివాసులు తన కుటుంబానికి ఎంతో అన్యాయం చేశారని.. తనకు చెందిన భూములను ఇతరులకు పంచాలని పోరాటం చేశారని.. మళ్లీ ఆరు నెలల క్రితం మహిళ అని చూడకుండా తనను బెదిరించారని.. కేసు వేశారన్నారు. తనను దోషిగా.. నిందితురాలిగా చూపించి ప్రస్తుతం తిరుపతిలో అభ్యర్థిగా వచ్చి గెలిపించాలంటే సాధ్యమా.. ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా పార్టీ అధినేతలు పునరాలోచించి తిరుపతికి మంచి అభ్యర్థిని కేటాయించాలని కోరారు.

ఏసీబీ వలలో కార్వేటినగరం ఆర్ఐ

కార్వేటినగరం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ రెడ్డెప్పన్ లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ అడిషినల్ ఎస్పీ దేవప్రసాద్ బుధవారం సాయంత్రం మీడియాకు వివరాలు వెల్లడించారు. కార్వేటినగరంలోని ముస్లిం కాలనీకి చెందిన షేక్‌మహ్మద్‌రఫీ గత కొన్నాళ్లుగా పట్టాదారు పాసుపుస్తకం మార్పుకోసం ఆర్ఐ రెడ్డెప్పన్‌ను అభ్యర్థిస్తున్నాడు. అయితే ఆర్ఐ రూ.12,500 డిమాండ్ చేశాడు. పేదరికంతో జీవనం గడుపుతున్న షేక్ మహ్మద్‌రఫీ అంత నగదు చెల్లించుకోలేమని వేడుకున్నా, ఆర్ఐ కనికరించలేదు. నగదు ఇచ్చాకే పట్టాదారు పాసుపుస్తకం సిద్ధం చేస్తామని చెప్పాడు. దిక్కుతోచని రఫీ తిరుపతి ఏసీబీ అధికారులను సంప్రదించారు. దీంతో బుధవారం ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి రఫీకి రూ.12.500 నగదును ఇచ్చారు. ఆ నగదును ఆర్ఐ రెడ్డెప్పన్‌కు ఓ టీ దుకాణం వద్ద అందజేశారు. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు వెంటనే ఆర్ఐని అదుపులోకి తీసుకుని నగదును, సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. ఈ దాడుల్లో డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, ఏసీబీ అధికారులు ఉన్నారు.



పట్టుబడిన ఆర్ఐ రెడ్డెప్పన్

నలుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్ : ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణలో అలసత్వం వహించిన నలుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ డీఈఓ దేవరాజు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు నగరం గాండ్లపల్లి మున్సిపల్ స్కూల్‌లో గణిత ఉపాధ్యాయులు కుసుమకుమారి, బొమ్మసముద్రం హైస్కూల్‌లో పీడీగా పనిచేస్తున్న శ్రీనివాసులును సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమించినా, వారు హాజరుకాకపోవడంతో సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని బాలాజీనగర్ కాలనీ మున్సిపల్ స్కూల్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న సుధీర్, గుడుపల్లె మండలం ఒంటిపల్లి స్కూల్లో పనిచేస్తున్న సుధాకర్ ఓపెన్ స్కూల్ విధుల్లో అలసత్వం వహించడంతో వారిని డీఈఓ సస్పెండ్ చేశారు.

చీటీ డబ్బులు కాజేసిన దంపతులపై కేసు

చిత్తూరు అర్బన్: చీటీల పేరిట పదుల సంఖ్యలో ప్రజల్ని మోసం చేసిన కేసులో చిత్తూరుకు చెందిన జమీల్, నిజాముద్దీన్ దంపతులపై టూటౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ ఉలసయ్య కథనం మేరకు, చిత్తూరు రామ్‌నగర్ కాలనీకి చెందిన జమీల్ స్థానికంగా అనధికార చీటీలు నిర్వహిస్తున్నారు. మహిళలను సభ్యులుగా చేర్పించి రెండేళ్ల క్రితం పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి తన భర్తతో కలిసి పారిపోయారు. ఇటీవల చిత్తూరుకు రావడంతో, బాధితులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జమీల్, ఆమె భర్త నిజాముద్దీన్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రియురాలు మాట్లాడలేదని యువకుడి ఆత్మహత్య

గంగాధర నెల్లూరు: ప్రేమించిన యువతి మాట్లాడలేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వింజం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వింజం గ్రామానికి చెందిన కుప్పయ్య కుమారుడు ధనుష్ (19) తను ప్రేమించిన అమ్మాయి మాట్లాడలేదని గ్రామానికి దూరంగా ఉన్న చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని తెలిపారు.

ఇంటి వద్ద తండ్రి శవం.. పది పరీక్షకు హాజరు

గంగాధర నెల్లూరు: తండ్రిని కోల్పోయిన బాధనంతా గుండెల్లో దాచుకుని, పదో తరగతి పరీక్ష రాసింది కుమార్తె. మండలంలోని లక్ష్మీరెడ్డిపల్లి దళితవాడకు చెందిన మహేంద్ర ట్రాక్టర్‌లో కూర్చుని ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి జారిపడి మంగళవారం మరణించాడు. అయితే తండ్రి మృతదేహాన్ని ఇంటి వద్ద పెట్టుకుని మృతుడి కుమార్తె మమత విషణ్ణ వదనంతో గంగాధర నెల్లూరు హైస్కూల్లో బుధవారం పదో తరగతి పరీక్షకు హాజరైంది. ఆ తర్వాత తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు ప్రారంభం



తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటుచేసిన రెండు రోజుల రాష్ట్ర స్థాయి అండర్-11, 14 స్కేటింగ్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. డీఈఓ శేఖర్ ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం వస్తుందని తెలిపారు. అనంతరం బాలబాలికలకు విడివిడిగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ సయ్యద్ సాహెబ్, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బయోటెక్ ఇంక్యుబేషన్ సెంటర్‌కు నిధులు

తిరుపతి సిటీ : శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఉమెన్ బయోటెక్ ఇంక్యుబేషన్ ఫెసిలిటీ సెంటర్‌కు మూడో విడతగా రూ.47.09లక్షలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు వీసీ భారతి తెలిపారు. బుధవారం ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజనితో కలసి మంజూరైన నిధుల పత్రాన్ని ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ ప్రొఫెసర్ కళారాణి, ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ విద్యావతికి అందజేశారు.

తెలుగు తమ్ముళ్ల వర్గపోరు

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముందే బాహాబాహీకి దిగిన వైనం

శ్రీరంగరాజపురం: మండలంలో టీడీపీ కార్యకర్తలు, నాయకుల మధ్య వర్గపోరు మరోసారి భగ్గుమంది. మండలంలోని జీఎంఆర్ పురంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ హాజరయ్యారు. ఆయన సమక్షంలోనే క్షీరసముద్రం గ్రామానికి చెందిన బీకేఎస్ మునివర్ధనాయుడు, చేకువారి ఇండ్లు గ్రామానికి చెందిన ధనంజయనాయుడికీ మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. మొదటి నుంచి పార్టీకీ కష్టపడి పని చేసిన కార్యకర్తలను కాదని, ఎన్నికల సమయానికి వచ్చిన బీకేఎస్ సంస్థ మునివర్ధనాయుడికి ప్రాధాన్యత ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన పార్టీలోకి వస్తే తాము టీడీపీకీ పనిచేయమని ధనంజయనాయుడి వర్గం తెగేసీ చెప్పేసింది. దీంతో అక్కడే ఉన్న మునివర్ధనాయుడు, ధనంజయనాయుడు మధ్య మాటామాటా పెరిగి బాహాబాహీకి దిగారు. ఇంత జరుగుతున్నా ఇన్‌చార్జి థామస్ స్పందించకపోవడం గమనార్హం.

ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిష్కారం

చిత్తూరు కలెక్టరేట్ : క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు ఫిర్యాదులను పరిష్కరిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం విజయవాడ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఎన్నికల కసరత్తుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ మాట్లాడుతూ నిర్దిష్ట కాలపరిమితిలో అభ్యంతరాలను, ఫిర్యాదులను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సీ విజిల్ యాప్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలన చేయిస్తున్నామని వివరించారు. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.36 లక్షలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాట్ల నివేదికను పంపుతున్నట్లు తెలిపారు. ప్రచారానికి అనుమతులన్నీ ఆన్‌లైన్ విధానంలో ఇస్తున్నట్లు చెప్పారు. మోడల్ కోడ్‌ను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో పది కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 68,563 మంది స్వామివారిని దర్శించుకోగా, 21,956 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.91 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు లేని భక్తులకు 8 గంటలు, ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తాళపత్రాల సంరక్షణ అభినందనీయం

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలోని వేదిక్ వర్సిటీలో సనాతన తాళపత్ర సంపద సంరక్షణ, డిజిటలైజేషన్ అభినందనీయమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. బుధవారం తిరుమల శ్రీవారి దర్శనానంతరం ఆయన ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో కలసి ఎస్వీ వేదిక్ వర్సిటీని సందర్శించారు.

ఈ సందర్భంగా సీజేఐకు వర్సిటీ అధికారులు వేదమంత్రాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన వర్సిటీలో సంరక్షింపబడుతున్న తాళపత్ర గ్రంథాలను నిశితంగా పరిశీలించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పురాతన తాళపత్రాల సేకరణ, సంరక్షణ, డిజిటలైజేషన్, పరిశోధనలను వేదిక్ వర్సిటీ నిర్వహించడం ఆనందంగా ఉందని ప్రశంసించారు. తాళపత్రాల్లోని విజ్ఞానాన్ని భావితరాలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జస్టిస్ చంద్రచూడ్‌ను వర్సిటీ అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వేదిక్ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రాధా గోవింద త్రిపాఠి, డీన్ గోలి సుబ్రమణ్యం, ఫైనాన్స్ ఆఫీసర్ అంజిరెడ్డి, పీఆర్‌ఓ డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.



సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌ను సత్కరిస్తున్న టీటీడీ, వర్సిటీ అధికారులు